

(26 వ భాగము)

ఆమెను వెంటబెట్టుకొని పక్షులగుంపు మధ్యకు వెళ్ళాను. బాగా బలంగా ఒకదాని మెడ పట్టుకున్నాను. గుర్రం ఎక్కినట్లుగా ఎక్కి కూర్చున్నాను. బరువుపైన పడగానే రెక్కలను విప్పి అటు ఇటు విసుర్తూ కాసేపు కొట్టుకుందా పక్షి.

నర్స్ ప్రక్కనే నిలబడి వుంది. ఆమెకేసి చూశాను.

"నీ వెనక ఎక్కేదా?" అంది.

"ఎక్కు" అన్నాను.

ఆమెకూడా ఎక్కి నా వెనుక కూర్చుంది. మా ఇద్దరి బరువుకు తట్టుకోలేక ఆ పక్షి తక్కున క్రిందకు పడింది. దాని పొట్ట భూమి కానుకుంది. ముందది భయపడిందేమో ననుకుని, నర్స్ క్రిందకు దిగబోయినా వారించాను వద్దని. ఐదునిముషాలపాటు అలాగే కూర్చున్నాను. కానీ అది

మామూలుగా లేచి నిలబడే ప్రయత్నమేమీ చెయ్యలేదు. దాంతో అది మోయలేని బరువువల్లే అలా కుప్పలా కూలి పోయి కూర్చుందని తీర్మానించుకున్నాను.

వెనక్కి తిరిగిచూసి "నువ్వు దిగు!" అన్నాను.

నర్స్ పక్షిపైనుండి దిగింది క్రిందకు.

ఆమె బరువు తగ్గగానే పక్షి యథాప్రకారం లేచి నిలుచుంది. రెక్కల్ని ఆడించింది.

"నువ్వింకో దానిపైకి ఎక్కు!" అన్నాను.

"ఒంటరిగానా?" అడిగింది భయంగా.

"ఆఁ!"

"అమ్మో! నాకు భయం!!" అంది.

"ఇద్దర్ని మోసే శక్తిలేదు వీటికి. అన్నీ గుంపులుగానే వెళ్తాయి. నీకేం భయం వుండదు. నేనుకూడా వెంట వుంటాగా. ఎక్కి కూర్చో! వెళ్ళు!" అంటూ ధైర్యం నూరిపోశాను.

అయిష్టంగానే అక్కడ్నుంచి కదిలింది. మరో పక్షి పైన ఎక్కి కూర్చుంది.

అవి ఇంకా ఏవేవో ఏరుకొని తింటూ వుండిపోయాయి. అక్కడ్నుంచి కదిలివెళ్ళే సూచనలు కనుపించలేదు. అలా ఎంతసేపు వుంటాయో ఊహించడం అసాధ్యమయింది నాకు.

ఆ బయలు ప్రదేశంలో చెల్లా చెదురుగా వెళ్ళి ఆహారం సేకరించుకొంటున్న పక్షులన్నీ మెల్లగా ఒక ప్రదేశం వద్దకు చేరుకొన్నాయి గుంపుగా. అప్పటికి బాగా పొద్దు వాలిపోయింది. గాలి కూడా బాగా చల్లగా వుంది.

పక్షులన్నీ విమానాల్లా లేచాయి ఆకాశంలోకి. ఆ తర్వాత స్పీడందుకొన్నాయి. వాటివేగం జెట్ విమా

నాలను మించిపోయినట్లనిపించింది. దాని మెడ పట్టుకొని కూర్చున్నానేగానీ, నాకు భయంగా వుంది. మాటిమాటికీ మెడను అటూ యిటూ త్రిప్పుతుందా పక్షి. వెనకగా వున్న నర్స్‌కేసి చూశాను. ఆమెకూడా చాలా ఇబ్బందిగా, భయంగా కూర్చునుంది.

ఇంకొంతదూరం ముందుకు పోయాం.

క్రింద ఏం కనిపిస్తుందో చూద్దామని తల వంచాను. విశాలమైన నీటిపొర కనుపించింది. బహుశా నేను సముద్రంపైన ఉన్నాననుకొన్నాను. అది ఏ సముద్రమో ఊహాకూడా అందలేదు.

ఈ పక్షులగుంపు ఏ దీవిలో మకాం పెట్టాయో, అక్కడెటువంటి మనుష్యులుంటారో, వాళ్ళతో ఏం ప్రమాదాలు ముంచుకొస్తాయోనని ఊహించుకుంటూ, నేనెక్కిన పక్షి మెడ తేలిగ్గా పట్టుకొన్నాను.

వెనకనుంచి "హెల్ప్, హెల్ప్" అంటూ నర్స్ కేకలు వినిపించాయి. ఆకాశంలో మేఘాలు ఢీకొన్నప్పుడు వినిపించే ఉరుముల్లాగున్నాయి ఆ కేకలు. వెనక్కి తిరిగి చూశాను. ఆమె పక్షి మెడను కరుచుకుని వుంది బల్లిలా. అదేమో గాలిలో పల్టీలు కొడుతున్నట్లు తిరిగిపోతుంది. అయినా దాన్ని పట్టించుకోలేదు మిగిలిన గుంపు. దాని వేగం తగ్గింది. మిగిలిన గుంపు ముందుకు సాగిపోతూనే వుంది.

నేను వెనక్కి తిరిగి చూశాను.

నర్స్ ఎక్కిన పక్షి అలానే పల్టీలుకొడుతూ క్రిందకు జారిపోయింది. ఆకాశంలోంచి నేలపైకి తోకతెగిన చుక్కలా నేలపైకి రాలిపోయింది. ఆ పక్షితోపాటు నర్స్ అంతర్థానమైపోయింది అరక్షణంలో.

ఆమెచేసిన పాపానికి ఫలితం, మరుజన్మలో కాకుండా, ఈ జన్మలోనే, నా కళ్ళముందు పొందడం ఒకవంక ఆనందాన్ని మరోవంక విచారాన్ని కలిగించింది నాకు. ఆమె ఆత్మకు శాంతి చేకూర్చమని భగవంతుణ్ణి మనసారా ప్రార్థించాను.

నేను ఎక్కిన పక్షి రివ్వున మేఘాలపైనుంచి దూసుకు పోతూంది. నా చుట్టూవున్న గుంపంతా కూడా అదే వేగంతో పరుగెత్తుతున్నాయి గాలిలో. అలా చాలాసేపు ఆకాశంలోనే వున్నాను.

ఆ తర్వాత మెల్లగా ఎత్తునుంచి క్రిందికి దిగటం మొదలెట్టాయి. నేను కాళ్ళు రెండు పెనవేసి కూర్చున్నాను. గొంతును మరికొంత ఘట్టిగా చేతుల్తో పట్టుకున్నాను. పది నిముషాల్లో విశాలమైన మైదానంలాంటి ప్రదేశంలోకి దిగింది గుంపంతా. పక్షులన్నీ నేలపైన కాళ్ళు ఆన్చాయి. నేను తక్కున క్రిందికి దూకాను. వాటి మధ్యనుండి దూరంగా వెళ్ళాను.

అది ఏ దీవో, భూగోళంలో ఏ భాగంలో వుందో, అర్థంకాలేదు నాకు. నా అంచనా ప్రకారం కొన్ని వందల మైళ్ళు వచ్చేసి వుండాలి. సూర్యుడు నాకు ఎడంచేతివేపు వున్నాడు చాలాసేపు. అంటే అంతకుముందున్న దీవినుండి దక్షిణంగా ప్రయాణంచేసి వుండాలి నేను.

ప్రపంచపటం నా కళ్ళముందు మెదలింది.

అంతకుముందున్న దీవిలో సైంటిస్టులు దాచుకొన్న మ్యాప్‌లను చూసి అందులో నేనున్న దీవిప్రాంతాన్ని గుర్తుపెట్టుకొని వున్నాను. దాన్నిబట్టి దక్షిణంగా వెళ్తే ఏయే దేశాలు, దీవులు, వస్తాయో లెఖగట్టాను.

నా అంచనాలు వంచన చెయ్యకుంటే, బహుశా నేను

ఉత్తర అమెరికాకు క్రిందిభాగంలో వున్న ఏదో దీవి చేరుకుని వుండాలి. ఆ దీవి ఏదైందీ తెలిసే అవకాశం మాత్రం లేదు.

బాగా చీకటిపడింది.

చిన్న చెట్ల గుంపొకటి కనుపించింది. దాని మధ్యకు వెళ్ళాను. ఏదైనా చెట్టుక్రింద నేల శుభ్రంచేసుకొని పడుకుందామనుకున్నాను. కానీ అక్కడ క్రూరజంతువు లేమైనా వుండి నేను ఆదమరచి నిద్రించే సమయంలో వచ్చి అమాంతంగా మింగివేస్తే చెయ్యగలిగిందేమీ వుండ దని ఆ ప్రయత్నం మానుకున్నాను.

మెల్లగా లావుపాటి చెట్టొకటి చూసుకుని ఎక్కాను. రెండు కొమ్మలమధ్య ఇరుక్కుని కూర్చున్నట్లే పడు కున్నాను.

కాసేపు నిద్రపోతే అలసిపోయిన శరీరానికి కాస్త విశ్రాంతి దొరుకుతుంది. కానీ నిద్రరాలేదు. కారణం ప్రేమల్లో రగులుతున్న మంట. ముందది ఆరితేగాని కళ్ళు మూతపడేట్లు లేవు. ఆకలితీరే మార్గంకోసం అన్వేషించుదా మనిపించింది. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. ఏ చెట్టు ఏదో, ఏ కాయ తింటే ఎలాంటి ప్రమాదమో తెలియకుండా, ప్రయత్నించడం నా చావు నేనే తెచ్చు కొన్నట్లవుతుందనిపించింది.

ఆకలిని అలానే అణగద్రొక్కి, పడుకున్నాను.

గాలిమాత్రం చల్లగా వస్తూంది. నా శరీరాన్ని ఫ్రిజ డైర్‌లో పెట్టినట్టుంది. ఒళ్ళు బాగా చల్లబడగానే ఆకలి మంట కాస్త తగ్గినట్లయింది. కళ్ళు వాటంతటవే అర్ధరాత్రి తర్వాత మూతలుపడ్డాయి. నాకు తెలియకుండానే నిద్ర లోకి జారిపోయాను.

మళ్ళీ కళ్ళు తెరిచేసరికి తెల్లగా తెల్లవారిపోయింది. చెట్టు పైనుంచి దూకాను. ఆ మైదానంలాంటి ప్రదేశం మధ్యగావున్న నీళ్ళ సరస్సులో కాళ్ళూ చేతులూ, కడుక్కుని, మొహం తడుపుకుని, కడుపునిండేట్లు నీళ్ళు త్రాగి బయలుదేరాను.

చాలాదూరం నడిచాను. రెండుగంటలకు పైనే నడిచాను. అంటే సుమారు ఆరేడుమైళ్ళు నడచివుండాలనుకున్నాను. మధ్యలో ఎక్కడా, జనసంచారంగానీ, జంతువుల చలనంగానీ లేదు.

ఆకాశంకేసి చూశాను.

నా ముందు దూరంగా ఎత్తైన లావుపాటి పెద్ద గొట్టంలాంటిదేదో కనుపించింది. అదేదో ఫ్యాక్టరీకి సంబంధించిందయింది వుండాలనుకున్నాను.

మనస్సు తేలికపడింది.

కాళ్ళలోకి క్రొత్త శక్తి వచ్చినట్లయింది.

కళ్ళు తేజోవంతమయినట్లు తోచాయి.

ఆ గొట్టాన్ని చూసుకుంటూ వడివడిగా నడచాను.

అలా నడుస్తున్నప్పుడు కాళ్ళనొప్పిగాని, ఆకలి మంటగానీ, నాకు గుర్తురాలేదు. తొందరగా అక్కడికి చేరుకుంటే నన్ను బంధించిన పరిస్థితుల్నించి, ఖైదుచేసిన పరిసరాలనుంచి పర్మనెంటుగా తప్పుకునే అవకాశం కనుపిస్తుందన్న ఆశ కలిగింది.

డెల్లా గుర్తుకొచ్చింది. ఆమెకోసం నేను ఎంత శ్రమపడ్డా, ఫలితం లభించనందుకు మాత్రం బాధ కలిగింది.

నడక వేగం హెచ్చించాను.

ఎండ ఎక్కువ కావటంతో గాలి వేడెక్కింది. నా మొహానికి వేడిగాలి తగులుతూంది. అడవిలాంటి ప్రదేశం

దాటగానే అట్టపెట్టెలాంటి అందమైన ఇళ్ళు చిన్నచిన్నవి కనుపించాయి,

ఇంకా వేగంగా నడిచాను.

ఆ ఇళ్ళ మధ్యకు వెళ్ళాను.

అక్కడ చాలా మంది మనుష్యులు కనుపించారు అంతా ఆడవాళ్ళు, పిల్లలు, మగవాళ్ళంతా పనుల్లోకి వెళ్ళి నట్లున్నారు.

ఒకావిడను మాటల్లోకి దించి వివరాలు సేకరించాను. అది ఉత్తర అమెరికాకు క్రింద వున్న దీవి. ఆ దీవిలో బంగారు దొరుకుతుంది. అమెరికా ప్రభుత్వపు గనులు ఆ ప్రాంతమంతా వున్నాయి. అక్కడ అన్నిదేశాల వాళ్ళూ పని చేస్తున్నట్లు ఆవిడ చెప్పింది.

ఆవిడ అమెరికన్ స్త్రీ. నన్ను చూడగానే ఇండియన్ వా అని అడిగింది. అవునన్నాను. అక్కడ్నుంచి మైలు దూరం వెళ్తే ఇండియన్స్ కాలనీ వుందని చెప్పింది.

ఆమెకు కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరించాను. మరి కొంతదూరం వెళ్ళాను నా దేశపు వాళ్ళుంటున్న కాలనీకి వెళ్దామని.

ఎదురొచ్చిన మనుషులు చాలామంది నన్ను గమనించ డాన్ని పసిగట్టాను. బహుశా నా బట్టల్ని చూచి అను కున్నాను. నా వొంటిపై నున్నవి బట్టలు కాదు పేలికలు. ఫక్తు బిచ్చగాడిలా వున్నానని నాకు తెలుసు. ఆ దీవిలో బహుశా బిచ్చగాళ్ళు వుండి వుండరు. అందువల్లే అంత ఆశ్చర్యంగా నాకేసి గమనించి చూస్తూన్నారనుకున్నాను.

తిన్నగా ఇండియన్స్ కాలనీకి వెళ్ళాను. మొత్తం నాలుగొందల ఇళ్ళు వుంటాయి. మనుషులు నా దేశం వాళ్ళే అయినా వాళ్ళు అమెరికన్లలాగే వున్నారు.

ఒక ఇంటి ముందు నిలబడ్డాను. ఆ ఇంటావిడ వచ్చి నిలుచుంది గుమ్మంలో. నేను అర్థంకాక కాసేపు చిత్రంగా చూశాను.

"ఎవరు కావాలి?" అడిగింది ఇంగ్లీషులో.

"ఆకలవుతుంది. కాస్త అన్నం కావాలి!" అన్నాను ఇంగ్లీషులో.

"నీది ఇండియానా!"

"అవును." అన్నాను.

"ఇక్కడికెలా వచ్చావ్?"

"అదో పెద్ద కథ! తర్వాత చెప్తాను!" అన్నాను.

ఆమె లోనికి వెళ్ళి ఒక పెద్ద బ్రెడ్, ఒక సాస్ సీసా తెచ్చి అందిచ్చింది. వీధిలో నిలుచుని తిన్నాను రెండు నిముషాల్లో.

"చాలా! మరో బ్రెడ్ ఇచ్చేదా?" అడిగింది.

"చాలు! చాలా థ్యాంక్స్." అన్నాను.

"ముందు వెళ్ళి సెక్యూరిటీ వాళ్ళకు రిపోర్టు చెయ్యి. లేకుంటే నానా గొడవ అవుతుంది!" అందామె.

"గొడవా? ఎందుకు?" అర్థంగాక అడిగాను.

"సెక్యూరిటీ వాళ్ళకు తెలీకుండా, ఎవ్వరూ ఈ దీవికి రాకూడదు! అలా వచ్చే వీలుకూడా లేదు. ఇక్కడకి వచ్చేవీ, పోయేవీ, ప్రభుత్వపు విమానాలే! ఎవరైనా దొంగ చాటుగా వచ్చి తిరుగుతున్నట్లు తెలిస్తే సెక్యూరిటీవాళ్ళు కనిపెట్టారంటే కాల్చి చంపుతారు." అందామె.

"నే వెళ్ళి రిపోర్టు చేస్తే చంపరా?" అడిగానామెను.

"బహుశా చంపరనుకుంటాను. నువ్వెలా వచ్చిందీ అడుగుతారు. చెప్పిన సమాధానాలు తృప్తికరంగా వుంటే

క్షమించి వదులుతారు. లేకుంటే..." అంటూ ఆగిపోయింది.

"లేకుంటే చంపేస్తారు! అవునా?" అడిగాను.

"అవును!" అందామె.

"నా సమాధానాలు వాళ్ళకు తృప్తిపరుస్తాయన్న నమ్మకంలేదు నాకు. వాళ్ళ ప్రమేయం లేకుండా నాకు మీలో ఎవ్వరూ ఆశ్రమం ఇవ్వలేరా! నాగ్రోజుండి వెళ్ళి పోతాను ఏదో మార్గం చూసుకుని" అన్నాను.

"లాభంలేదు!" అందామె.

ఇంక ఆవిడను బలవంతం చేసిగూడా లాభం వుండదని అర్థం చేసుకున్నాను. నా ఆకలి తీర్చినందుకు మరోమారు థాంక్స్ చెప్పి, సెక్యూరిటీవాళ్ళు ఎక్కడుంటేదీ అడిగి తెలుసుకుని అక్కడ్నుంచి కదిలాను.

ఇండియన్స్ వుండే కాలనీకి, సెక్యూరిటీ డిపార్టుమెంటు వాళ్ళ ఆఫీసుకు దాదాపు రెండుమైళ్ళ దూరముంది.

వెళ్ళగానే నన్ను ముందు బంధించారు. చేతులకు అరదండాలు తగిలించి ఒక ఆఫీసరు దగ్గరకు తీసుకెళ్ళారు.

ఆయన రకరకాల ప్రశ్నలకు ఓర్పుగా సమాధానం చెప్పాను.

నా అనుభవాలు, అగచాట్లు, సాహసాలు, విని విస్తు పోయాడు. పెద్ద పక్షి నెక్కి ఈ దీవికి వచ్చానని చెప్పి నప్పుడు మాత్రం ఆయన ఆశ్చర్యానికి అంతూ పొంతూ లేకుండా పోయింది.

"నీలాగే మరో స్త్రీ చెప్పింది" అన్నాడు.

"స్త్రీయా! ఆమె పేరు చెప్పిందా?" అడిగాను ఆతృతగా ఆమె డెల్లా తప్ప మరో మనిషి కావటానికి వీల్లేదనుకుంటూ.

"పక్షి నెక్కి రావటం తప్ప మరేదీ గుర్తులేదంది. ఆమెను బంధించివుంచాం. నువ్వు గుర్తుపట్టగలవేమో

చూస్తావా?'' అడిగాడు అతను.

''చూస్తాను!'' అన్నాను.

ఇద్దరి గార్డ్సు నన్నుప్పగించారు. వాళ్ళ వెంట వెళ్ళాను. వెనుకవేపునున్న గదుల్లో ఒకదాని తలుపులు తీశారు. లోపల నేలపైన వెల్లికింతలా పడుకునివున్న ఆమెకేసి చూసాను. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. చచ్చిపోయిందనుకున్నా. నా డెల్లా సజీవంగా వుంది ముందు.

''డెల్లా!'' అరచాను పెద్దగా.

అంత పెద్దగా అరచినా ఆమెకు వినిపించనట్లు, కనీసం తలైనా త్రిప్పకుండా పడుకుండిపోయింది. దగ్గరగా వెళ్ళి కూర్చొని ఆమెను నావేపుకు త్రిప్పుకున్నాను. నా వంక చూసింది. ఆ చూపులు తీక్షణంగా వున్నాయి.

''నేను డెల్లా! నీ రాజ్ ను! గుర్తుపట్టలేదూ!'' అడిగాను ఆతృతగా.

పిచ్చిదానిలా చూసింది తప్ప, మాట్లాడలేదు.

''మాట్లాడవెందుకు? నీకోసం వెతకని స్థలంలేదు. నిన్నీ స్థితికి తెచ్చిన ఆ నర్స్... కాదు – రాక్షసి ఘోరమైన చావు చచ్చింది. రా!'' అన్నాను.

ఆమె కదలలేదు!

డెల్లా మతి చెడిపోయిందని ధృవపరచుకున్నాను. ఎంత పోరాడినా ఆమె నన్ను గుర్తించలేకపోయింది. గార్డ్సు నన్ను తిరిగి వాళ్ళ ఆఫీసరుముందుకు తీసుకొచ్చారు. ఆమె వివరాలు చెప్పాను. అంతా విని కాగితంపైన నోట్ చేసుకున్నాడు.

గార్డ్స్ నన్నుగూడా తీసుకెళ్ళి బంధించారు. డెల్లా ప్రక్కగదే నాది!

ఆలోచిస్తూ కూర్చున్నాను.

వీళ్ళు మమ్మల్ని ఏంచేస్తారో అర్థంగాలేదు. వాళ్ళ అనుమతి లేకుండా వచ్చినందుకు ఉరితీస్తారా?

డెల్లా కనుపించినందుకు ఆనందం కలిగినా, ఇద్దరం మళ్ళా ఖైదీలుగా మారడం, ఆవేదన కలిగించి, అశాంతి రేపింది. ఏదైనా మార్గం వెతుక్కొని తప్పించుకుందామనుకున్నాను. గదంతా కలయజూచాను. వెంటిలేటరులాంటిది కూడా లేదు. ద్వారబంధం, కిటికీ వెంటిలేటరు, మొత్తం ముందున్న కమ్ముల తలుపే!

ఒకవేళ వీళ్ళ బారినుండి తప్పించుకున్నా, ఈ దీవినుండి బైటపడేందుకు మార్గం మాత్రం ఏమిటి? విమానాల్లో వెళ్ళే వీలులేదు. అవన్నీ ప్రభుత్వానివి.

మళ్ళీ ఆ పక్షుల గుంపును వెతుక్కుంటూ వెళ్ళాలి. అవి మళ్ళీ తీసుకొచ్చిన స్థలానికి తీసుకెళ్తాయి తప్ప, వేరే దేశానికో, దీవికో మమ్మల్ను చేరుస్తాయన్న నమ్మకం అణుమాత్రం కూడా లేదు.

ఆలోచిస్తూ పడుకున్నాను.

డెల్లా కిలాంటి మతిస్థిరం లేని స్థితి విషపుగాలులవల్ల వచ్చింది. ఆమెను మామూలు మనిషిని చేయించేందుకు దారి ఏదైనా వుందో, లేదో? అలాంటి దారేదీ లేకుంటే జీవితాంతం ఆమె అలానే వుండిపోవాల్సి వస్తుందేమోనన్న భయం పట్టుకుంది.

అంతలోనే మేమిద్దరం ప్రస్తుతం వున్న పరిస్థితి గుర్తొచ్చింది. ముందీ చెరనుంచి బైటపడ్డాక, ఆ తర్వాతగదా ఆ విషయం గురించి ఆలోచించవలసిందనుకున్నాను.

ఆ రాత్రి కమ్మటి భోజనం పంపారు. చాలా దినాల తర్వాత, ఆ మాటకొస్తే చాలా నెలల తర్వాత అంత కమ్మటి భోజనం తినటం ఇదే మొదటిసారి. సుష్టుగా భోజనం చేశాను.

ట్రే తీసుకెళ్ళేందుకొచ్చిన గార్డును "సిగరెట్లు దొరుకు తాయా?" అని అడిగాను.

"కావాలా?" అడిగాడతను.

"కావాలి!" అన్నాను.

"తెచ్చిస్తాను!" అంటూ ట్రే చేతికి తీసుకున్నాడు.

"మిస్టర్!" పిలిచానతన్ని.

ఏమిటన్నట్లు చూశాడు నాకేసి.

"ప్రక్కగదిలో వున్నామెకు భోజనం పెట్టావా?" అడిగాను.

"ఆఁ!" అంటూ తలూపాడు.

"తిన్నిందా?"

"హాయిగా తినింది!"

"థాంక్స్!" అన్నాను.

అతను వెళ్ళిపోయాడు వెలుపలకు.

మతి ఎలావున్నా, ఆహారం తీసుకుంటున్నందుకు డెల్లా గురించి నాకు ఆనందం కలిగింది. ఆమెను ఎలాగైనా పెద్ద పెద్ద డాక్టర్లకు చూపించి ఆరోగ్యం బాగుచేయించాలను కొన్నాను. ఎక్కడో ఒకచోట సెటిలయి పెళ్ళాడి, పిల్లపాపలతో సుఖంగా జీవించాలనిపించింది. ఇంకా ఈ సాహసాలకు, అర్థంలేని ప్రయాణాలకూ, ప్రయాసాలకు స్వస్తి చెప్పాలనిపించింది.

ఆ రాత్రి హాయిగా నిద్రపోయాను.

తెల్లవారాక గార్డ్స్ వచ్చారు. కాలకృత్యాలు తీర్చు కొన్నాను. తొమ్మిదిగంటల ప్రాంతంలో బ్రేక్‌ఫాస్ట్ పంపారు. తిని, సిగరెట్ దమ్ములాగాను. పదింటికి నన్ను రమ్మని ఆఫీసరు కబురుపంపాడు.

వెళ్ళి నిలబడ్డాను అతనిముందు.

సప్లిమెంట్ పోటీ - 22.

U, V, W, X, Y — అక్షరాలను తీసుకొని మీకు నచ్చిన వరుసక్రమంలో, ఈ క్రింది గళ్ళను పూరించండి. మీ జవాబులను ఒక పోస్టుకార్డుసైజు తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసల స్టాంపులు జతపరిచి, ఈ నెల 30 వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి.

మా ఆఫీసులో సీలుచేసిన జవాబుతో సరిపోలిన జవాబుకు ఏడాదిపాటు 'సప్లిమెంట్' ఉచితంగా పంపుతాం. ఫలితాలు సెప్టెంబరు '76 నెల మాసపత్రికలో చూడండి.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "సప్లిమెంటు" ముఖచిత్రాలు పరిశీలించండి. రెండింటికి సంబంధం ఉండేటట్లుగా ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని, వ్రాసి, ఈ నెల 10 వ తేదీ లోపు మాకు చేరేట్లు పంపండి. 'హోమ్ డెలివరీ' సభ్యులు తమ సభ్యత్వము నెంబరు వ్రాస్తేచాలు. సభ్యులు కానివారు తమవ్యాఖ్యలతో 30పై.లు స్టాంపులుపంపాలి. మాకు నచ్చిన వ్యాఖ్యలలో అత్యుత్తమమైన వ్యాఖ్యకు రూ. 20 లు నగదు బహుమతి పంపుతాము.

మీరే ఎన్నుకోండి ?

ఈ "సప్లిమెంటు"లో మీకు బాగా నచ్చిన నవల పేరును ఒక పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, ఈ నెల10 వ తేదీ లోపు మాకు పంపండి. హోమ్ డెలివరీ సభ్యులు తమ నెంబరు తప్పక వ్రాయాలి. ఇతరులు తమ జవాబుతో ఈ కూపన్ కత్తిరించి పంపాలి. ఉత్తమ నవలకు రూ. 116 లు బహుమతి ఇవ్వబడుతుంది. *

కూర్చోమని సంజ్ఞ చేశాడు.

అతనిముందు కూర్చున్నాను.

"నువ్వు చెప్పిన వివరాల ప్రకారం చెక్ చేశాం. అంతా నిజమని తేలింది!" అన్నాడు.

నేనేం మాట్లాడలేదు.

"మీ దేశపు ప్రభుత్వం నీమీద మూడు నేరాలు మోపింది. వాటిన్ని నీ పరోక్షంలో విచారించింది. స్మగ్లింగ్ వ్యాపారంలో చెయ్యి వేసినందుకు పదేళ్ళు, కోస్టల్ గార్డ్సను చంపినందుకు పాతికేళ్ళు, ప్రభుత్వానికి చిక్కకుండా తప్పించుకొనిపోయినందుకు మరో పాతికేళ్ళు మొత్తం అరవై సంవత్సరాల కఠిన కారాగారశిక్ష విధించింది నీకు" అన్నాడా ఆఫీసరు.

నా మొహాన నెత్తురుచుక్క లేకుండా పోయింది.

"నీ ప్రియురాలు డెల్లాగురించి గూడా చెక్ చేశాం!" అన్నాడా ఆఫీసరు.

నేనేం మాట్లాడకుండా అతని మొఖంలోకి చూశాను.

"ఆమెను నువ్వు పెళ్ళాడినట్లు ఏవిధమైన ఋజువూ లేనందువల్ల, బ్రిటిషు ప్రభుత్వం ఆ దేశం ప్రకారం ఆమెను అక్కడికి పంపుతున్నాం. నిన్ను మీ ప్రభుత్వానికి అప్పగించమని మా ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది" అన్నాడా ఆఫీసరు.

"మమ్మల్ని ఇక్కడి కూలీలుగానన్నా బ్రతకనివ్వ లేరా?" అడిగాను అరిస్తూ.

"సారీ! మీ ప్రభుత్వ అభీష్టానికి వ్యతిరేకంగా ఏ పనీ చెయ్యడానికి మాకు ఇష్టంలేదు. నువ్వుచేసిన నేరాలకు నువ్వు అక్కడే శిక్ష అనుభవించాలి!"

"పోనీ డెల్లాను నాతో పంపతేరా?"

"దానికి నువ్వు మీ ప్రభుత్వానికి అర్జీ పెట్టుకో!"

"అంతకన్నా మరోదారి ఏదీ లేదా? మేము తప్పించుకొని పోయామని చెప్పండి. ఏదో దారి చూసుకుంటాం. మళ్ళీ నాదేశం వెళ్ళి చచ్చేదాక ఖైదీలా బ్రతకడం భయంకరంగా అనిపిస్తూంది" అన్నాను.

"నీకు వేరే దారిలేదు! నిన్నూ, డెల్లానూ, మోసుకొచ్చిన పక్షులగుంపును కూడా రాత్రి కాల్చిపారేశాం!" అన్నాడా ఆఫీసరు.

నా కళ్ళు చెమర్చాయి!

"నువ్వు వెళ్ళి, రాత్రి ప్రయాణానికి సిద్ధంగా వుండు!" అన్నాడు అతను.

"థాంక్స్!" అని వెళ్ళిపోయాను.

సెలు గదిలో కూర్చుని ఆలోచించసాగాను.

నా జీవితం తలుచుకొని నాకే నవ్వొచ్చింది. చదువు ముగించింది మొదలు, నా బ్రతుకంతా ఖైదీలాగే గడిచింది. కొన్నాళ్ళు స్మగ్లర్లకు, మరికొన్నాళ్ళు ప్రకృతికి, ఇంకొన్నాళ్ళు పరిస్థితులకు, ఖైదీనయాను, ఇంక మిగిలిన జీవితం చట్టానికి ఖైదీగా బ్రతకాలి!

రాత్రి విమానం ఎక్కాం. డెల్లా కూడా నాతోనే వుంది. నా ప్రయాణానికి ఏర్పాట్లుచేసిన ఆఫీసరు నన్ను విమానం ఎక్కిస్తూ "మిస్టర్ రాజ్!" అన్నాడు.

"సారీ! నా పేరు మిస్టర్ ఖైదీ!" అన్నాను.

"ఐ. సీ." అంటూ నవ్వి "ఆమె మామూలు మనిషి కాదు! గర్భంతో వుంది. మీరు మీదేశం వెళ్ళగానే ఆమె మీ భార్యని, పెళ్ళి చేసుకొన్నానని, ఇండియాకు పిలిపించ

మని అర్జీ పెట్టుకోండి. తప్పకుండా పిలిపిస్తారు, ఈ పరిస్థితుల్లో'' అన్నాడు.

నవ్వొచ్చింది ఆ మాటలకు.

ఈ ఖైదీ కడుపున పుట్టినవాడు కూడా మరో ఖైదీ అవుతాడా?

'ఏమో? కాలమే నిర్ణయించాలి!' అనుకుంటూ విమానం ఎక్కాను.

విమానం కదిలింది.

ఇండియాలోని ఏదో జైల్లో మిగిలిన జీవితం నిస్సారంగా బ్రతికేందుకు సన్నిద్ధమైన నన్ను వేగంగా మోసుకు పోసాగింది విమానం. నా వొళ్ళో మతిస్థిరం లేని డెల్లా పడుకుని వుంది.

మాది అమరమైన ప్రేమ! నేనెక్కడున్నా నా గుండె నిండా వున్నది, వుండేది డెల్లాయే!

—:సమాప్తం:—